




# కరపత్రం

SINCE 2014

శుక్రవారం జూన్ 26, 2026 | సంపుటి : 2 | సంచిక : 254 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


జల వివాదాలను పరిష్కరించుకుందాం

## పంచాయితీలు కాదు...
## పరిష్కారాలు ముఖ్యం




- తుంగభద్ర గేట్ల ప్రారంభం చరిత్రలో నిలవాలి
- మూడు రాష్ట్రాల పరిధిలో సమస్యలకు పరిష్కారం చూపాలి
- కేంద్రమంత్రి పాటిల్ దీనిని అవకాశంగా తీసుకోవాలి
- తుంగభద్రలో 15 టిఎంసిలకు 5 టిఎంసిలే అందుతున్నాయి
- మునీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి





**బళ్లారి,జూన్25 :**
తుంగభద్ర నది ఒడ్డున.. బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.'తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం,పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం. అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి.. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నానని అన్నారు. నీటి సమస్యలు పరిష్కరించకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తున్నాయి. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నాం. దాదాపు 10 టీఎంసీల నీరు మా వరకూ రావట్లేదు. రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో నిలుస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

మిగతాద్ది 2 లో

## వెనిజువెలాకు
## మోడీ ఆపన్నహస్తం

- సాయం అందిస్తామని ప్రకటన
- సాయం కోసం సిద్ధంగా ఉన్నామన్న ట్రంప్



**న్యూఢిల్లీ,జూన్25 :**
వెనెజువెలాలో సంభవించిన వరుస భూకంపాలతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఇప్పటివరకు 32 మంది ప్రాణాలు కోల్పోగా.. 700 మంది వరకు గాయపడ్డారని తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. రాజధాని నగరం కరాకస్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత ధాటికి భవనాలు కూలిపోవడంతో.. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారు. దాంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ఈ విపత్తు సమయంలో ఆదుకునేందుకు ప్రపంచ దేశాలు ఆపన్నహస్తం సాచాయి. వెనెజువెలా ప్రకృతి విలయంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ఆ దేశానికి అండగా ఉంటామని ఎక్స్ వేదికగా వెల్లడించారు. సహాయసహకారాలు అందిస్తామని ప్రకటించారు. వెనెజువెలా ప్రజలకు సహాయం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా సంసిద్ధంగా ఉండాలని అన్ని ఏజెన్సీలను ఆదేశించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వెనెజువెలా ప్రజలను గొప్ప స్నేహితులుగా అభివర్ణించారు. ఇప్పటికే సహాయక బృందాలను మోహరించామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో వెల్లడించారు.



## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై విచారణ

- స్పీకర్ తీర్పు కాపీలను సమర్పించాలని హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్,జూన్25 :**
పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది ఎమ్మెల్యేల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది.

2 లో



## సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

- కాంగ్రెస్ క్యాడర్ బూత్ విడిచి వెళ్లవద్దు
- ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపు

**హైదరాబాద్,జూన్25 :**
సర్‌పై అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ నేతలకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ..

## ఎస్టీ రిజర్వేషన్లు
## ఇందిరమ్మ పుణ్యం

» అభివృద్ధిని ఓర్వేలకపోతున్న బావాబామ్మర్దులు
» ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను ప్రారంభించిన టీపీసీసీ చీఫ్



**హైదరాబాద్,జూన్25 :**
ఇందిరాగాంధీ.. ఎస్టీ రిజర్వేషన్ ఇవ్వకపోయి ఉంటే నేడు లంబాడీలు, ఎరుకల, యానాదిలు ఈ స్థాయిలో ఉండేవాళ్లు కాదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. లంబాడీల బాగు కోసం పనిచేసే ప్రభుత్వం తమది అని స్పష్టం చేశారు. ఇందిరాగాంధీ గుడిసెలు లేని గ్రామాలు కావాలని అనుకున్నారని.. ఆ దిశగానే తాము ముందుకు వెళ్తున్నామని చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ గిరిజన నేతలు చేపట్టిన ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావు శకం గతమని.. అధికారం పోయిందన్న అక్కసుతో వారిద్దరూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

మిగతాద్ది 2 లో

## కర్ణాటక ప్రాజెక్టులతో మరణశాసనమే

- పాలమూరుకు చుక్కనీరు కూడా రాదు
- మాజీమంత్రి శ్రీనివాసగౌడ్ ఆందోళన

**మహబూబ్‌నగర్,జూన్25 :**
కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టుల వల్ల తెలంగాణకు మరణ శాసనం కానుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆర్డీఎస్‌పై కృష్ణ పరివాహక ప్రాంతంలో ఆయా ప్రాంత రైతులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. తాము మాట్లాడుతున్నది అవాస్తవం కాదని అన్నారు.



మిగతాది 2లో

## ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు
## హైకోర్టులో స్వల్ప ఊరట



2లో..

**హైదరాబాద్:**
తెలంగాణ హైకోర్టు లో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయొద్దంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 9లోని కొన్ని నిబంధనలపై హైకోర్టు స్టే విధించింది. మంగళవారం వరకు స్టే విధిస్తూ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ హైకోర్టు పలు వ్యాఖ్యలు చేసింది."ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఎందుకు విడుదల చేయలేదు. మీరు బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల నుంచి యాజమాన్యాలు వసూలు చేయొద్దంటే కళాశాలను వారు ఎలా నడుపుతారు?

## ప్రజాప్రభుత్వంలో
## రైతుభరోసాకు పెద్దపీట

- రెండేళ్లలో లక్ష కోట్లు రైతాంగానికి అందజేశాం
- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా..అప్పులు చేసి ఇస్తున్నాం
- పదివేల కోట్లు నష్టం వచ్చినా పంటలు కొనుగోలు చేశాం
- సిఎం సభావేదికను పరిశీలించిన మంత్రి తుమ్మల



2లో

**ఖమ్మం,జూన్25 :**
ప్రజాప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన కార్యక్రమం రైతు భరోసా అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. జులై నెలలోనే రైతులకు రైతుభరోసా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రెండేళ్లలో లక్ష కోట్లు రైతాంగానికి అందజేశామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేశామని అన్నారు. ఏడాదికి పది వేల కోట్లు నష్టం వచ్చినప్పటికీ కొనుగోలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని రైతులందరికీ కలిపి రైతు భరోసా కింద రూ.9 వేల కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారన్నారు. ఈ సభకు రైతు ఆశీర్వాద సభగా రైతులే నామకరణం చేశారని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో ఈనెల 30న జరిగే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభా స్థలాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..



## గతాన్ని మరచి పోండి..
## అలాంటి పొరపాట్లు జరగవు

- ఇకముందు మిమ్ములను బాగా చూసుకుంటా
- వచ్చేది కెసిఆర్ ప్రభుత్వమే అంటూ..కార్యకర్తలకు కెటిఆర్ భరోసా



2లో..

**వికారాబాద్,జూన్25 :**
వచ్చే ఐదేళ్లు మన ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్యకర్తల బాగోగులు, ప్రజల సంక్షేమం రెండింటిని బ్యాలెన్స్‌గా నడిపించే బాధ్యత నాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసానిచ్చారు. 2028లో మీ అందరి దయతో కేసీఆర్ ముఖ్యమంత్రి అయితరు.. అయిన తర్వాత నేను బాధ్యత తీసుకుంటా..అన్నారు. మీకు రావాల్సిన పదవులు.. జరుగాల్సిన లాభం. మీకు కోరుకునే గౌరవం వచ్చే విధంగా చేసే బాధ్యత నాది. గతం మరిచిపోండి.. చిన్నచిన్నపొరపాట్లు జరిగి ఉండొచ్చు. ఇక్కడ ఉద్యమంలో పనిచేసిన బిడ్డలు కూడా ఉన్నారు. వాళ్లకు కూడా అయ్యో మాకు జరుగాల్సిన న్యాయం జరుగలేదనే భావన ఉండొచ్చు. నేను వారందని ప్రార్థిస్తున్నానని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణా కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ..

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం జూన్ 26, 2026

## జల వివాదాలను పరిష్కరించుకుందాం

మొదటి పేజీ తరువాయి
పాలమూరు వలసల గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. మూడు రాష్ట్రాల కరువు జిల్లాలకు ఇది పరిష్కారం చూపబోతోందని పేర్కొన్నారు. గురువారం తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లు ప్రారంభించాక, కర్ణాటక కొప్పల్ జిల్లా మునీరాబాద్ బహిరంగ సభలో సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసు అని చెప్పుకొచ్చారు. మనందరి కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు చంద్రబాబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని తెలిపారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోవడంతో నీరు సముద్రం పాలవుతోందని చెప్పారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని అన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తమకు రావడం లేదని చెప్పారు. ద రైతులకు న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని అన్నారు. చరిత్రలో ఈరోజు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుందని తెలిపారు. తమకు పంచాయితీలు వద్దని.. పరిష్కారం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ, తెలంగాణలోని లక్షలాదిమంది రైతుల సమస్యకు తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పరిష్కారమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నీటి సమస్యను పరిష్కరించక పోవడంతోనే పాలమూరు వాసులు వలసలు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. నీటి సమస్యలు ఓ కొలిక్కి వచ్చాయని.. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించామని తెలిపారు. తుంగభద్రలో పూడికతీతకు సంబంధించిన వ్యవహారంపై కేంద్రమంత్రితో చర్చించామని అన్నారు. తుంగభద్ర నది ఒడ్డున జరిగిన చర్చలు అంతరాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నీటి సమస్యను సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పుకొచ్చారు. ఆయన ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారనే నమ్మకం తమకు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఎస్టీ రిజర్వేషన్లు
## ఇందిరమ్మ పుణ్యం

మొదటి పేజీ తరువాయి
కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి.. బావాబామ్మర్దులకు నచ్చడం లేదని మహేష్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు తగ్గకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. 1 లక్ష 78 వేల కోట్ల
రూపాయల విదేశీ పెట్టుబడులు తీసుకొచ్చామని తెలిపారు. ఫ్యూచర్ సిటీని మొదలు పెట్టి 5 లక్షల 78 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెప్పారు. బస్సు యాత్ర ముగింపు కార్యక్రమానికి ప్రియాంక గాంధీని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ లంబాడ ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు.

## సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి
సర్ క్రియను కాంగ్రెస్ క్యాడర్ అధిగమించాలని ఎంపీ తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నేతలు అంతా ఈపక్రియను పరిశీలించాలన్నారు. రెండు చోట్ల ఓటు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. నెల రోజుల పాటు బీఎల్‌వోలు బూత్‌ను విడిచి వెళ్లొద్దని ఆదేశించారు. ప్రతి పది బూత్‌లకు ఒక సూపర్‌వైజర్‌ను, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక సూపర్‌వైజర్‌ను పెడుతున్నామన్నారు. బీఎల్‌వోలతో నాయకులు నిరంతరం టచ్‌లో ఉండి.. సర్ జరిగే విధానాన్ని పరిశీలించాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 36 వేలకు పైగా పోలింగ్ బూత్‌లలో ఎస్ఐఆర్ పక్రియ కొనసాగుతోందన్నారు. ఇప్పటికే అన్ని పోలింగ్ బూత్‌లలో బీఎల్‌ఏలను నియమించామని తెలిపారు. ఎస్.ఐ.ఆర్‌ను సీరియస్‌గా తీసుకోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. బిహార్‌లో 76 లక్షల ఓట్లు, పశ్చిమ బెంగాల్‌లో 90 లక్షల ఓట్లను తొలగించారని.. ఆ రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. కేరళలో కాంగ్రెస్ కార్యకర్తలు ముందుగానే అలర్ట్ కావడంతో కాపాడుకోగలిగామని ఎంపీ వెల్లడించారు. ఇప్పుడు తెలంగాణలోనూ అదే జరగబోతోందన్నారు. నెల రోజుల పాటు జరిగే సర్ పక్రియలో బీఎల్‌వోలు మూడు సార్లు ఇంటికి వచ్చే ప్రయత్నం చేస్తారన్నారు. తెలంగాణలో ఇప్పటికే 1 కోటి 2 లక్షల ఓట్లను అన్‌మ్యాప్ చేశారని.. అంటే దాదాపు 33 శాతం ఓట్లు అన్‌మ్యాప్ అయ్యాయని తెలిపారు. బీఎల్‌వోలు అప్రమత్తంగా లేకపోతే కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓట్లు కూడా తొలగిపోయే అవకాశం ఉందన్నారు. 2002 ఓటర్ లిస్ట్, 2025 ఓటర్ లిస్ట్, అన్‌మ్యాప్ ఓటర్ లిస్ట్‌ను దగ్గర పెట్టుకుని పరిశీలించాలని సూచించారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై విచారణ

మొదటి పేజీ తరువాయి
గతంలో ఈ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పలువురు ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు పరిశీలించింది. విచారణ సందర్భంగా అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను కోర్టుకు సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. అలాగే పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్ కూడా తమ కౌంటర్ దాఖలు చేయాలని మరోసారి నోటీసులు జారీ చేసింది. ఇంతకుముందు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడంపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో కేసు విచారణను వాయిదా వేస్తూ తదుపరి విచారణను జూలై 22కు నిర్ణయించింది.

## గతాన్ని మరచి పోండి..
## అలాంటి పొరపాట్లు జరగవు

మొదటి పేజీ తరువాయి
గతంలో లాగా చిన్నచిన్న పొరపాట్లు జరుగకుండా చూసుకుంటమని నేను మీకు మాటిస్తున్నానన్నారు. వాస్తవానికి మొత్తం ప్రభుత్వం మీద దృష్టి పెట్టినం.. పార్టీ మీద ఎక్కువ దృష్టి పెట్టలేదు. కొత్త రాష్ట్రం, కొత్త సంసారం కాబట్టి పునాది గట్టిగా పడాలి అని.. మన రాష్ట్రం నవ్వే వాళ్ళ ముందు జారిపడొద్దని.. మీకు పరిపాలన చేతనైతదా అన్నోళ్లను నోళ్లు మూయించాలే.. మంచిగా నడిపించాలని ఆలోచన చేసాం తప్ప వేరే ఆలోచన చేయలేదని అన్నారు. ఒక సైనికుడు శాంతి సమయంలో ఎంత చెమట చిందిస్తే, యుద్ధంలో అంత తక్కువ రక్తం కారుతుంది. మీ ఈ టైంలో పార్టీని బందబస్తుగా నిర్మాణం చేసుకుంటే రేపు ఎన్నికలు వచ్చినంక ఆగమాగమయ్యే బాధ తప్పుతది.. మీకు ఐడీ కార్డు వస్తది.. ఆ ఐడీ కార్డు రేపు మన ప్రభుత్వం వచ్చినంక జేబులో పెట్టుకొని పోతే ఆ ఆఫీసర్ అయినా పోలీసోడు అయినా కేసీఆర్ మనిషి వచ్చిండు పని చేయాలని మీకు గౌరవమిచ్చి పనిచేసే పరిస్థితి ఉంటది. మంచి ఐడీ కార్డు తయారుచేసి ప్రతీ కార్యకర్తకు ఇస్తం. మిమ్మల్ని రాబోయే 5 సంవత్సరాలు మాత్రం గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ జరుగకుండా ఉద్యమ కారులను కానీ, కార్యకర్తలను కానీ కడుపులో పెట్టుకొని చూసుకునే బాధ్యత తీసుకుంటానన్నారు. ప్రభుత్వం లేదు.. పవర్ లేదు కానీ గర్వంగా ఎక్కడనిపిస్తుందంటే ఎమ్మెల్యే పోయినా.. ఎంపీ పోయినా.. అధికారం పోయినా ఇంతమంది సోదరులు ఇక్కడికొచ్చి మీరు చేస్తున్న ప్రకటన మామూలు ప్రకటన కాదు.. ఇది కాంగ్రెస్, బీజేపీ పార్టీ గుండెల్లో రైళ్లను ఉరికించే గొప్ప దృశ్యం ఇక్కడ కనిపిస్తుందని చేవెళ్ల సమావేశాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీ అందరికీ తెలుసు మనకు అధికారం పోయి రెండున్నరేళ్లయింది. ఎన్నికల ముందేమో నేను గుంపు మేస్త్రీని. రియల్ ఎస్టేట్ అంటేనే రేవంత్ రెడ్డి.. రేవంత్ రెడ్డి అంటేనే రియల్ ఎస్టేట్ అని ఫోజులు కొట్టిండు. ఇవాళ రియల్ ఎస్టేట్‌ను ఏం చేసిండు మరి.. బొంద పెట్టిండు.. వంద ఫీట్ల అడుగులో పాతిపెట్టే పని చేసిండని మండిపడ్డారు.మన ప్రభుత్వం, పెద్దలు కేసీఆర్ ఉన్నప్పుడు షాబాద్‌లో చందన్ వెల్లిలోకానీ, సీతారాంపూర్‌లో కానీ ఎకరం 30 లక్షలుండేది. కానీ అక్కడ ఇండస్ట్రియల్ పారిశ్రామిక పార్క్ తీసుకొచ్చిన తర్వాత అక్కడ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కంపెనీలు ఒక మైక్రోసాఫ్ట్, అమెజాన్ వెల్స్‌ఫన్ ఇతర కంపెనీలు తీసుకొచ్చిన తర్వాత నేడు ఎకరం 3 కోట్లకు తక్కువ షాబాద్‌లో లేని పరిస్థితి ఉంది. అదే రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత లక్షల
మంది రియల్ ఎస్టేట్ మీద ఆధారపడి పనిచేసుకునే తమ్ముళ్లు, చె÷-లలెళ్లందరూ ఇవాళ దివాళా తీసే పరిస్థితి వచ్చిందన్నారు. వాస్తవేంటంటే ఎన్నికలకు ముందు ఎకరం కోటి రూపాయలు పలికింది కూడా ఇవాళ కనీసం రూ.50 లక్షలు, రూ.60 లక్షలకు కూడా కొనేందుకు ఎవరూ సిద్ధంగా లేరన్నారు. దారుణమైన పరిస్థితి ఉంది. ఎందుకీ పరిస్థితి ఉందనేది మనం ఆలోచన చేసుకోవాల్సి ఉందని కేటీఆర్ గుర్తు చేశారు.

## ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు
## హైకోర్టులో స్వల్ప ఊరట

మొదటి పేజీ తరువాయి
రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారు?పెండింగ్ బకాయిలు ఎప్పటిలోపు చెల్లిస్తారు?" అని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వం తరఫు న్యాయవాది స్పందిస్తూ ఆగస్ట్ 15లోపు బకాయిలు చెల్లిస్తామని బదులిచ్చారు. అలా జరిగితే తమ పిటిషన్లు కూడా వెనక్కి తీసుకుంటామని ప్రైవేట్ కళాశాలల తరఫు న్యాయవాది చెప్పారు.
ఇదే అంశంలో విద్యార్థులు కూడా ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. విద్యార్థుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అటు ప్రభుత్వం, ఇటు కళాశాలల యాజమాన్యాల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారన్నారు. ఈ బకాయిలతో విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కోర్టును కోరారు. మంగళవారం అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారని ప్రభుత్వం తరఫు న్యాయవాది చెప్పారు. అనంతరం తదుపరి విచారణను మంగళవారానికి ఉన్నత న్యాయస్థానం వాయిదా వేసింది.

## ప్రజాప్రభుత్వంలో
## రైతుభరోసాకు పెద్దపీట

మొదటి పేజీ తరువాయి
ప్రభుత్వం కష్టంలో ఉందని, నిధుల కొరత ఉందని అయినా రైతాంగానికి అండగా ఉండాలని అప్పుచేసి మరీ రైతుభరోసా ఇస్తున్నామని చెప్పారు. ఈనెల 28న రైతు ఎగ్జిబిషన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. 28, 29 రెండు రోజుల పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సభా ప్రాంగణంలో అందుబాటులో ఉంటారన్నారు. 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ జరుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. భారత దేశంలో అత్యధికంగా పంటలు పండించిన రాష్ట్రం తెలంగాణ అని మంత్రి అన్నారు. వ్యవసాయ రంగంలో పంటమార్పిడి విధానంలో ఆయిల్ ఫాం సాగును ప్రోత్సహిస్తు న్నామన్నారు. భవిష్యత్తులో పది వేల ఎకరాలను రైతులు సాగు చేసే విధంగా సహకారం అందజేస్తు న్నామని చెప్పారు. దేశంలో తెలంగాణలోనే అత్యధిక ఆయిల్ ఫాం సాగు జరుగుతోందన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని తెలిపారు. ఏడు రకాల వరి అందుబాటులో ఉందని రైతాంగానికి తుమ్మల తెలియజేశారు. వాతావరణ పరిస్థితులను బట్టి రైతులు పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా ఉంచుతున్నారని... నిల్వ చేసి అధిక ధరలకు అమ్మేందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఎవరూ కూడా భయపడవద్దని.. అందరికీ యూరియా అందిస్తామని స్పష్టం చేశారు. యూరియా కోసం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చామని.. అందులో అన్ని వివరాలు ఉన్నాయన్నారు. యూరియా కోసం తెచ్చిన యాప్ దేశానికే ఆదర్శమని ప్రధాని మోదీ కూడా ప్రశంసించే పరిస్థితి ఉందన్నారు. రైతాంగం పాడి పంటపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. అత్యధికంగా పురుగుల మందులు వాడుతున్నారని ఇక్కడి పంటలను విదేశాలు రిజెక్ట్ చేస్తున్నాయన్నారు.

## కర్నాటక ప్రాజెక్టులతో
## మరణశాసనమే

మొదటి పేజీ తరువాయి
తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల ఎత్తివేతకు హెలికాప్టర్‌లో వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అక్రమా ప్రాజెక్టులు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఆర్డీఎస్‌కు వంద మీటర్ల దూరంలోనే కర్ణాటక ప్రభుత్వం లిఫ్ట్ పనులు మొదలు పెట్టిందని, వీటితోపాటు మరో రెండు రోడ్ కమ్ బ్యారేజులు కడుతుందని ఆరోపించారు. చంద్రబాబు గుండ్రేవుల వద్ద 20 టీఎంసీల రిజర్వాయర్‌కు ప్రణాళిక తయారు చేశారని వెల్లడించారు. వీటి వల్ల తుంగభద్ర నీరు శ్రీశైలంకు శాశ్వతంగా రావని వివరించారు. కృష్ణా పైకూడా అనేక ప్రాజెక్టులు కడుతున్నారని, ఇవన్నీ ఎలాంటి అనుమతులు లేకుండానే జరుగుతున్నాయని వెల్లడించారు. అక్రమ నిర్మాణాలు పూర్తయితే పాలమూరు లో ఎన్ని ప్రాజెక్టులు కట్టినా ఒక్క చుక్క నీరు రాదని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అయినా అక్రమ ప్రాజెక్టుల వద్దకు వెళ్లి చూడాలని కోరారు. జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా వ్యతిరేకించారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే కర్ణాటక, ఏపీ ప్రభుత్వాలు అక్రమంగా చేపట్టిన ప్రాజెక్టు పనులు నిలిపివేస్తామని అన్నారు.

## వెనిజువెలాను వణికించిన
## వరుస భూకంపాలు

**39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూప్రకంపనలు**
**నేలమట్టం అయిన భారీ భవనాలు..ఇళ్లు, భవన సముదాయాలు**
**ప్రాథమిక సమచారం మేరకు 32 మంది మృతి**
**దాదాపు శతాబ్దకాలం తరవాత అతిపెద్ద భూకంపంగా నమోదు**
**అత్యవసర పరిస్థితి ప్రకటించిన అధ్యక్షురాలు రోడ్రిగేజ్**

వెనిజువెలాలో కేవలం నిమిషం తేడాలో రెండుసార్లు భారీ భూకంపం వణికించింది. బుధవారం స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం ఆరు గంటల సమయంలో వెనిజువెలాలో రెండుసార్లు భూమి కంపించింది. తొలుత రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.2 కాగా, ఆ తర్వాత 7.5 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదు అయ్యాయి. ఆ భూకంపాల ధాటికి భారీ బిల్డింగ్‌లు నేలమట్టం అయ్యాయి. లా గౌరియా ప్రాంతం తీవ్రంగా ప్రభావానినికి గురైంది. అయితే ఆ భూకంపాల వల్ల 32 మంది మృతిచెందగా, 700 మంది గాయపడినట్లు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. డజన్ల సంఖ్యలో బిల్డింగ్‌లు కూలాయని, వీలైనంత వరకు అందర్నీ రక్షిస్తున్నామని, రెస్క్యూ ఆపరేషన్ చేపట్టామని, లా గౌరియా రాష్ట్రంలో పరిస్థితి భయానకంగా ఉందని అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. దేశ రాజధాని కారకాస్‌కు పశ్చిమ దిశలో 168 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరీబియన్ తీరంలోని మోరన్ ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకటించింది. సుమారు 22 కిలోమీటర్ల లోతులో భూమి కంపించినట్లు పేర్కొన్నారు. దాదాపు శతాబ్ద కాలం తర్వాత వెనిజువెలాలో భారీ భూకంపం సంభవించింది.మృతుల సంఖ్య లక్ష వరకు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే పేర్కొన్నది. వెనెజువెలాను బుధవారం నాడు వరుస భూకంపాలు 39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూకంపాలు సంభవించి తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. కరేబియన్ తీరంలోని మోరోన్ పట్టణానికి పశ్చిమాన 21 కిలోమీటర్ల దూరంలో 7.2 తీవ్రతతో మొదటి భూకంపం వచ్చింది. అదే పట్టణానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో క్షణాల వ్యవధిలోనే 7.5 తీవ్రతతో మరో భూకంపం సంభవించింది. ఈ ఘటనలో 10 వేల నుంచి లక్ష మంది వరకూ ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే అంచనా వేసింది. అలాగే వేల మంది ప్రజలు గాయపడి ఉండొచ్చని తెలిపింది. భూకంపాలతో అనేక భవనాలు నేలమట్టం కాగా, ప్రజలు భయంతో పరుగులు తీస్తున్న అనేక వీడియోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి.మొదటి భూకంపం వచ్చినప్పుడు ఒక్కసారిగా పెద్దపెద్ద భవనాలు కూలిపోవడం ప్రారంభమయ్యాయి. అనేక చిన్నచిన్న ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఏం జరుగుతుందో గ్రహించి, ప్రాణరక్షణ కోసం ప్రజలు పరిగెత్తే లోపే అంతకంటే ఎక్కువ తీవ్రతతో రెండో భూకంపం వచ్చింది. దీంతో భారీ విధ్వంసం జరిగింది. కొన్ని భారీ భవనాలు కూలిపోగా, మరికొన్ని బిల్డింగులు ఊగిపోయాయి. కొన్ని ఇళ్ల పైకప్పులు కూలిపోగా, శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారు. దీంతో తమ ప్రాణాలను, కుటుంబ సభ్యులను కాపాడు కునేందుకు స్థానికులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. మరోవైపు వెనెజువెలాలోని సైమన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయం పైకప్పు కూలిపోయింది. దీంతో విమానాశ్రయంలోని టెర్మినల్ మొత్తం దుమ్ముతో నిండిపోయింది. కొంతమంది ప్రయాణికులు తమ లగేజీ పట్టుకుని ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు.

## వరుస భూకంపాలను డబ్లెట్ అంటారు

### ఒకేరోజు పలు దేశాల్లో ప్రకంపనలు
### కాలిఫోర్నియా, జపాన్, పుల్వామాలోనూ ప్రకంపనలు

వెనెజువెలా దేశం శతాబ్దకాలంలో ఎన్నడూ చూడని ప్రకృతి విపత్తును చవిచూసింది. వెనువెంటనే రెండు శక్తిమంతమైన భూకంపాలతో ఉక్కిరిబిక్కిరైంది. తొలి భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదు కాగా, రెండోది మరింత తీవ్రత (7.5)తో వచ్చింది. అదే సమయంలో కొంచెం అటూఇటుగా అమెరికాలోని కాలిఫోర్నియాలో (5.6), జపాన్ (7.2)లోనూ భూకంపాలు వచ్చాయి. ప్రపంచంలో ఒకే రోజు ఇలా వేర్వేరు చోట్ల పుడమి ఉగ్రరూపం దాల్చడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ భూకంపాల మధ్య ఏమైనా సంబంధం ఉందా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే, దీనికి 'కాదు' అనే సమాధానం ఇస్తున్నారు కాలిఫోర్నియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన భూకంప శాస్త్రవేత్త డాక్టర్ లూసీ జోన్స్. ఈ భూకంపాలు వేర్వేరు ఫాల్ట్ సిస్టమ్స్ (ఫలకాలు కలిసే సరిహద్దులు, పగుళ్లు), ప్లేట్ బౌండరీల్లో సంభవించాయి. అంటే వాటి మధ్య సంబంధం లేదని అర్థం. ఒకదానిని మరొకటి ప్రేరేపించలేదు. ఒక చోట సంభవించే భారీ భూకంపాలు.. వేల మైళ్ల దూరంలో మరో భూకంపానికి దారితీసే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని జోన్స్ వెల్లడించారు. ఇలా ఒకే సమయంలో వేర్వేరు చోట్ల భూమి కంపించడం అనేది యాదృచ్ఛికమేనని చెబుతున్నారు.
ఒక ప్రాంతంలో భూకంపం రావడమనేది అనూహ్యంగా జరిగే సంఘటన కాదు. కొన్ని దశాబ్దాలు, శతాబ్దాలుగా భూగర్భంలో ఒత్తిడి పేరుకుపోయి.. ఫలకాలు ఒకదానికొకటి రాసుకోవడం వల్ల ఇవి
సంభవిస్తుంటాయి. అయితే భూకంపాలు సరిగ్గా ఎప్పుడు వస్తాయనేది అంచనా వేయడం అసాధ్యమే అయినా.. ఇలా ఒక్కసారిగా భూమి కంపించడం ఒక చక్రంలా జరిగే పక్రియేనని జోన్స్ పేర్కొన్నారు.
కాగా.. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో 3.5 తీవ్రతతో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో భూకంపాలు రాగా.. గురువారం తెల్లవారుజామున పుల్వామాలో భూమి కంపించిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. భూకంప కేంద్రం నేపాల్‌లో 15 కిలోమీటర్ల లోతున ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక, జపాన్‌లో తొలుత భూకంప తీవ్రత 6.9 అని రాగా.. తర్వాత దానిని 7.2గా సవరించారు. చాలా తక్కువ వ్యవధిలో అంటే కొన్ని సెకన్ల నుంచి నిమిషాల తేడాతో దాదాపు ఒకే తీవ్రత గల రెండు భూకంపాలు ఒకే ప్రాంతంలో సంభవించడాన్ని 'ఎర్త్‌క్వేక్ డబ్లెట్' అంటారు. ఒకసారి భూకంపం వచ్చిన తర్వాత తక్కువ తీవ్రతతో చిన్న చిన్న ప్రకంపనలు రావడం సహజమే. కానీ డబ్లెట్ విషయానికొస్తే.. రెండోసారి వచ్చే భూకంపం కూడా దాదాపు మొదటిదానంత తీవ్రంగా ఉంటుంది. ఇప్పుడు వెనెజువెలాలో 39 సెకన్ల వ్యవధిలో వరుస భూకంపాలు వచ్చాయి. దీంతో ఇప్పుడు ఈ దేశ పరిస్థితిని శాస్త్రవేత్తలు 'ఎర్త్‌క్వేక్ డ్లబెట్'గా పిలుస్తున్నారు. వెనెజువెలాలో ఈస్థాయిలో భూకంపం 1900 సంవత్సరంలో వచ్చింది. అప్పుడు దాని తీవ్రత 7.7గా నమోదైంది. దాంతో రాజధాని సమీప ప్రాంతాలు ప్రభావితమయ్యాయి. మళ్లీ 2018లో 7.3 తీవ్రతతో భూమి కంపించినప్పటికీ.. ఆస్తి, ప్రాణనష్టం ఇప్పటితో పోలిస్తే తక్కువగానే సంభవించింది.

## జాతీయ సెలవు దినం కావడంతో ప్రజలంతా ఇంటివద్దే

వెనెజువెలా దేశాన్ని వరుసగా రెండు భూకంపాలు వణికించాయి. ఈ ప్రకృతి విపత్తు తీవ్రత ధాటికి దేశ రాజధానిలో తీవ్ర నష్టం వాటిల్లింది. పలు బహుళ అంతస్తు భవనాలు కూలిపోయాయి. శిథిలాల కింద ప్రజలు చిక్కుకుపోయి ఉండొచ్చని, దాంతో భారీ సంఖ్యలో ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ భూకంపాల తర్వాత బలమైన ప్రకంపనలు రావొచ్చు. దాంతో ఈ విపత్తు విధ్వంసకరంగా ఉండొచ్చు. భారీగా ప్రాణ, ఆస్తినష్టం సంభవించే అవకాశం ఉంది. మృతుల సంఖ్య 10వేల నుంచి లక్ష వరకు ఉండవచ్చని యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. ప్రస్తుతానికి వెనెజువెలా ప్రభుత్వం మృతుల సంఖ్యపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. భూకంపాల ధాటికి గాయపడిన వారి సంఖ్య పెరుగుతూనే ఉందని స్థానిక అధికారులు, ప్రత్యక్ష సాక్షులు చెప్తున్నారు. ఇళ్లను వదిలి బయటకు వచ్చేయాలంటూ భూకంపాల ప్రభావిత ప్రాంతాల ప్రజలకు వెనెజువెలా ప్రభుత్వం సూచించింది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఇళ్లకున్న పెట్రోల్ సరఫరాను కట్ చేసినట్లు వెల్లడించింది. కొన్ని భవనాలు కూలిపోయాయని, మరింత నష్టం వాటిల్లకుండా ఈ చర్యలని పేర్కొంది. జూన్ 24.. వెనెజువెలాలో నేషనల్ హాలిడే. దాంతో మిగతా రోజులతో పోలిస్తే.. ఎక్కువమంది ఇళ్లలోనే ఉన్నారు. బుధవారం సాయంత్రం ఆరుగంటల సమయంలో తొలి భూకంపం వచ్చింది. దాంతో భూమి కంపించినప్పుడు భారీగా ప్రజలు బయటకు పరిగెత్తిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ప్రాణనష్ట తీవ్రత పెరగడానికి ఈ హాలిడే కూడా ఒక బలమైన కారణం కావొచ్చని అధికారులు చెప్తున్నారు. ఈ విపత్తులో భారీగా మరణాల సంఖ్య ఉండొచ్చని వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ కూడా తన సందేశంలో పేర్కొన్నారు. రెండు భారీ భూకంపాల తర్వాత 20 వరకు ప్రకంపనలు వచ్చాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో వెనెజువెలాలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. భూకంపం ధాటికి మెక్వెషియా అంతర్జాతీయ విమానాశ్రయం దెబ్బతిన్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. దాంతో దానిని మూసివేశారు. పలు విమానాల రాకపోకలను నిలిపివేశారు. రాజధానితో పాటు భూకంప ప్రభావిత ప్రాంతాల్లో పాఠశాలలు
మూసివేశారు.

## భూకంపాలపై గూగుల్ ముందే హెచ్చరికలు
## స్మార్ట్ ఫోన్లకు అలర్ట్‌లు పంపిన గూగుల్

వందేళ్లలోనే ఎన్నడూ చూడని ప్రకృతి విపత్తుతో వెనెజువెలా దేశం అల్లాడిపోతోంది. వరుసగా రెండు శక్తిమంతమైన భూకంపాల ధాటికి అనేక భవనాలు నేలమట్టమై లక్షలాది మంది ప్రజలు వీధినపడ్డారు. కాగా.. ఈ భూకంపాలు సంభవించడానికి కొన్ని క్షణాల ముందు గూగుల్ పలు స్మార్ట్‌ఫోన్లకు దీని గురించి అలర్ట్‌లు పంపించినట్లు తాజాగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన కొన్ని స్క్రీన్‌షాట్లను నెటిజన్లు సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. బుధవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఈ అలర్ట్‌లు వచ్చినట్లు సమాచారం. ఆ తర్వాత కాసేపటికే భూకంపాలు సంభవించాయి.
అధునాతన స్మార్ట్‌ఫోన్లలో యాక్సిలరోమీటర్ అనే పరికరం ఉంది. సాధారణంగా ఇది ఒక సెన్సార్. మీరు ఫోన్‌ను అడ్డంగా పట్టుకున్నప్పుడు స్క్రీన్‌ను ఆటోమేటిక్‌గా తిప్పుతుంది. అయితే, దీని వల్ల మరో ఉపయోగం కూడా ఉంది. ఈ సెన్సార్ కంపనాలను కూడా గుర్తించి కొలవగలదు. మనం ఉంటున్న ప్రాంతంలో భూమి నుంచి వెలువడే వైబ్రేషన్స్‌ను ఇది సేకరిస్తుంది. ఇవి భూకంపానికి దారితీసేంత బలంగా ఉంటే.. వెంటనే గూగుల్ ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్‌కు సిగ్నల్ పంపిస్తుంది. సుమారుగా ఏ ప్రాంతంలో భూకంపం వచ్చే అవకాశం ఉందో కూడా చెబుతుంది. ఒక స్మార్ట్‌ఫోన్ నుంచి ఈ సిగ్నల్ అందిన వెంటనే.. గూగుల్ సర్వర్ ఆ ప్రాంతంలోని మిగతా ఫోన్లలోని యాక్సిలరోమీటర్లను పరిశీలిస్తుంది. అత్యధిక ఫోన్లు ఇలాంటి ప్రకంపనలే గుర్తిస్తే.. వెంటనే భూకంపం వస్తుందని అంచనా వేసి ఆ ప్రాంతానికి అలర్ట్స్ పంపిస్తుంది. ఈ పక్రియ శరవేగంగా జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 200 కోట్ల ఆండ్రాయిడ్ ఫోన్లలో ఈ ఫీచర్ ఉన్నట్లు గూగుల్ తెలిపింది. సాధారణంగా భూకంపం అనేది ఒక్కసారిగా వచ్చే కుదుపు కాదు. తరంగాల రూపంలో సంభవిస్తుంది. తొలుత ప్రైమరీ వేవ్స్ వస్తాయి. ఇవి సెకనుకు ఆరు కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఆ తర్వాత సెకండరీ వేవ్స్ వస్తాయి. ఇవి సెకనుకు 3-4 కిలోమీటర్ల వేగంతో పయనిస్తాయి. భూకంపం వల్ల జరిగే అత్యధిక నష్టానికి ఈ తరంగాలే కారణం. ఇక, మన స్మార్ట్‌ఫోన్లు గుర్తించేవి ప్రైమరీ వేవ్స్‌నే. ఇవి రాగానే సర్వర్‌కు సిగ్నల్ ఇస్తాయి. అందువల్ల.. సెకండరీ వేవ్స్ రావడానికి ముందే గూగుల్ సర్వర్లు సమాచారాన్ని సేకరించి అలర్ట్ ఇవ్వడానికి సమయం లభిస్తుందని టెక్ నిపుణులు పేర్కొంటున్నారు. భూకంప తీవ్రతను అంచనా వేసినదాని బట్టి.. ఆండ్రాయిడ్ ఫోన్లు రెండు రకాల అలర్ట్‌లు ఇస్తుంటాయి. ఒకటి 'బి అవేర్ అలర్ట్'. ఇది తక్కువ తీవ్రతతో ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నప్పుడు ఇచ్చే సిగ్నల్. ఇక రెండోది 'టేక్ యాక్షన్ అలర్ట్'. మధ్యస్త, తీవ్ర స్థాయి భూకంపాల సమయంలో దీనిని జారీ చేస్తుంటుంది. దీన్ని టచ్ చేయగా.. భూకంపం వచ్చే అవకాశం ఉన్న పరిధిని చూపిస్తుంది. దీంతో పాటు విపత్తు సమయంలో సురక్షితంగా ఎలా బయటపడాలో తెలిపే కొన్ని సూచనలు చేస్తుంది. మన దేశంలోనూ 2023 నుంచి ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్ యాక్టివ్‌లో ఉంది.


# ఈ వారం కోరుట్ల నియోజకవర్గ వార్తలు టూకీగా

గాజెంగి మహేశ్వర్,కోరుట్ల ప్రతినిధి

ఇంజనీరింగ్ విద్యార్థి అనుమానాస్పద మృతి పై ఆందోళనలు, మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో స్థానిక సమస్యలపై చర్చలు ప్రధానాంశాలుగా నిలిచాయి.

## 1. విద్యార్థి రాహుల్ మృతిపై కోరుట్లలో భారీ ధర్నా

**నిరసనలు:** కోరుట్ల మండలం అయిలాపూర్‌కు చెందిన బిటెక్ విద్యార్థి అంకం రాహుల్ ఆంధ్రప్రదేశ్‌లో అనుమానాస్పద స్థితిలో శవమై తేలడం కలకలం రేపింది.
డిమాండ్: తమ కుమారుడిని ప్రణాళికాబద్ధంగా హత్య చేశారని కుటుంబ సభ్యులు, పద్మశాలీ సంఘం నేతలు ఈ వారం కోరుట్ల పట్టణంలో జాతీయ రహదారిపై రాస్తారోకో, భారీ ధర్నా నిర్వహించారు. నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.




## 2. కోరుట్ల మున్సిపల్ సర్వసభ్య సమావేశం

**సమస్యలపై చర్చ:** కోరుట్ల మున్సిపల్ సాధారణ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ హాజరయ్యారు.
ముఖ్య సూచనలు: పట్టణంలో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని, ప్రభుత్వ భూముల మ్యాపింగ్ వేగవంతం చేయాలని అధికారులను కోరారు. అలాగే చారిత్రక వారసత్వ సంపద అయిన గడి బురుజు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని స్పష్టం చేశారు.

## 3. అభివృద్ధి పనుల నిధులు మంజూరు

**రహదారులు & డ్రైనేజీ:** నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనుల కోసం 4 కోట్ల 47 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు.

## 4.నవోదయ పాఠశాల సందర్శన

కోరుట్లలోని నవోదయ నివాస పాఠశాలను బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్, స్థానిక నాయకులు సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతులు, హాస్టల్ సదుపాయాలపై వారు సంతృప్తి వ్యక్తం చేసారు.

# ఈ వారం మేడ్చల్ జిల్లా వార్తలు టూకీగా

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి




**ఆర్టీఏ కార్యాలయాల్లో ఏజెంట్లు**
ఇటీవల ఏసీబీ సోదాలు జరిగినప్పటికీ, వారం రోజుల విరామం తర్వాత మేడ్చల్ ఆర్టీఏ కార్యాలయంలో ఏజెంట్లు మళ్లీ క్రియాశీలకంగా మారినట్లు వార్తలు వస్తున్నాయి.

## ఈ-వేలం సక్సెస్

మేడిపల్లిలో హెచ్‌ఎండీఏ (HMDA) నిర్వహించిన ప్లాట్ల ఈ-వేలం ప్రక్రియ విజయవంతమై, ప్రభుత్వానికి ఏకంగా రూ.120 కోట్ల ఆదాయం సమకూరింది.
ప్రభుత్వ భూములపై ఉత్తర్వులు
కాప్రా పరిధిలోని రూ.వేల కోట్ల విలువైన 90.08 ఎకరాల ప్రభుత్వ భూమి విషయంలో కింది కోర్టు ఇచ్చిన ఆదేశాలపై హైకోర్టు మధ్యంతర స్టే విధించింది.

## రసాయన పరిశ్రమలో అగ్నిప్రమాదం

మేడ్చల్ పారిశ్రామిక వాడలోని ఒక కెమికల్ ఫ్యాక్టరీలో బుధవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రియాక్టర్లు పేలడంతో భారీగా మంటలు, దట్టమైన పొగ వ్యాపించగా అగ్నిమాపక సిబ్బంది శ్రమించి అదుపులోకి తెచ్చారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల స్కామ్

పేదల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో మోసాలకు పాల్పడిన వ్యవహారంలో ఒక జీహెచ్‌ఎంసీ (GHMC) ఉద్యోగినితో సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు.

## సిలిండర్ పేలుడు

కాప్రా చౌరస్తాలోని ఒక ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో గ్యాస్ సిలిండర్ పేలి ఒక బాటసారికి తీవ్ర గాయాలయ్యాయి.
దారుణ హత్య వెలుగులోకి ప్రియుడితో ఏకాంతానికి అడ్డు వస్తున్నాడనే నెపంతో రెండేళ్ల కన్న కొడుకును తల్లి, ఆమె ప్రియుడు కలిసి చంపేసిన దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిందితురాలైన తల్లిని అరెస్ట్ చేశారు.

## వర్షాలు & నీటి నిల్వ

జిల్లాలో కురిసిన వర్షాలకు బాలానగర్ పోలీస్ స్టేషన్ ముందర మరియు పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
త్రాగునీటి కష్టాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో ప్రజలు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు.

# తెలంగాణ స్థానికత హక్కుల పరిరక్షణకు మరో ఉద్యమం తప్పదా?

- హైకోర్టు తీర్పుపై ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలి
- గ్రూప్-1 నియామకాల్లో తెలంగాణ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆరోపణ
- 15 రోజుల్లో చర్యలు లేకపోతే నిరుద్యోగులతో కలిసి న్యాయపోరాటం చేస్తామని హెచ్చరిక
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత





కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 25

తెలంగాణ స్థానికత హక్కుల పరిరక్షణ కోసం మరోసారి ఉద్యమం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. గురువారం తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన "తెలంగాణ స్థానికత – సవాళ్లు" అంశంపై రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్థానికత అంశంపై శతాబ్దాలుగా తెలంగాణ ప్రజలు అన్యాయాన్ని ఎదుర్కొంటున్నారని, చారిత్రకంగా ముల్కీ నిబంధనల నుంచి తెలంగాణ ఉద్యమం వరకు జరిగిన పరిణామాలన్నీ స్థానిక హక్కుల పరిరక్షణ కోసమేనని కవిత వివరించారు. స్థానికుల ఉద్యోగ హక్కులను కాపాడేందుకు గత పాలకులు తీసుకొచ్చిన నిబంధనలు సక్రమంగా అమలు కాకపోవడంతో తెలంగాణ ప్రజలు ఎన్నో పోరాటాలు చేయాల్సి వచ్చిందన్నారు.
హైకోర్టు ఇటీవల స్థానికత అంశంపై ఇచ్చిన తీర్పు తెలంగాణ యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ఆత్మను అర్థం చేసుకొని న్యాయవ్యవస్థ నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసి తెలంగాణ హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 నియామకాలలో తెలంగాణ అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆరోపించిన కవిత, స్థానికులకు రావాల్సిన అవకాశాలను ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు కల్పించారని విమర్శించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం పరిమిత అవకాశాలు మాత్రమే ఉండాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు జరిగాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యోగాలు, వనరులు, అవకాశాల విషయంలో స్థానికులకు పూర్తి న్యాయం జరగలేదని ఆమె వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లోనే కాకుండా ప్రైవేట్ రంగంలోనూ స్థానిక యువతకు ఆశించిన స్థాయిలో అవకాశాలు కల్పించలేదని అన్నారు. తుంగభద్ర, కృష్ణా జలాల విషయంలోనూ తెలంగాణ హక్కులను ప్రభుత్వం సమర్థంగా కాపాడలేకపోతోందని విమర్శించిన కవిత, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం మరింత దృఢంగా వ్యవహరించాలని సూచించారు. స్థానికత అంశంపై ప్రభుత్వం 15 రోజుల్లోగా సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని, లేనిపక్షంలో నిరుద్యోగులు, ఉద్యమకారులతో కలిసి తామే న్యాయపోరాటం ప్రారంభిస్తామని హెచ్చరించారు. తెలంగాణ యువత భవిష్యత్తు, ఉద్యోగ హక్కుల పరిరక్షణ కోసం అన్ని వర్గాలు ఏకమై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.
జూలై 2న ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించనున్న మిలియన్ మార్చ్‌కు తెలంగాణ ప్రజలు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి స్థానిక హక్కుల పరిరక్షణకు మద్దతు తెలపాలని కవిత పిలుపు నిచ్చారు.

# ఓయూ రసాయన శాస్త్ర విభాగంలో డిజైన్ సెమినార్ల నిర్వహణలో అక్రమాలపై ఉన్నత స్థాయి కమిటీ వేయాలి

» అధికార దుర్వినియోగనికి పాల్పడ్డ ప్రొఫెసర్లపై కఠిన చెర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలి
» ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఓయు కార్యదర్శి లెనిన్ డిమాండ్



కరపత్రం ప్రతినిది హైదరాబాద్, జూన్ 25

ఉస్మానియా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో పీహెచ్.డి. పరిశోధక విద్యార్థుల డిజైన్ సెమినార్ల నిర్వహణలో అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చాయని, రసాయన శాస్త్ర విభాగంలో డిజైన్ సెమినార్ల నిర్వహణలో అక్రమాలపై ఉన్నత స్థాయి కమిటీ వేసి, కమిటీ నివేదిక ప్రకారం అధికార దుర్వినియోగనికి పాల్పడ్డ ప్రొఫెసర్లపై కఠిన చెర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ( ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఓయు కార్యదర్శి ఐ.లెనిన్ లు డిమాండ్ చేసారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రసాయన శాస్త్ర విభాగంలో పీహెచ్.డి. పరిశోధక విద్యార్థుల డిజైన్ సెమినార్ల నిర్వహణలో తీవ్రమైన అక్రమాలు మరియు అధికార దుర్వినియోగం జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఓయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డా. కృష్ణంరాజు పర్యవేక్షణలో ఉన్న ఒక పీహెచ్.డి. విద్యార్థికి డిజైన్ సెమినార్ నిర్వహించకుండానే పూర్వ తేదీతో (గ్రాతీవ-ఝ్వస) డిజైన్ సెమినార్ నివేదిక జారీ చేసారని, ఈ ప్రక్రియకు రసాయన శాస్త్ర విభాగాధిపతి, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ మరియు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు ప్రొఫెసర్ విజ్జులత, అలాగే రసాయన శాస్త్ర విభాగ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ మరియు ఎంఎంటీఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్, విషయ నిపుణుడు ప్రో. సక్ రామ్ సహకరించినట్లు తెలిసిందన్నారు. డిజైన్ సెమినార్లు పూర్తి చేయని లేదా సమర్పించని సుమారు 80 మంది పీహెచ్.డి. విద్యార్థులను కట్ ఆఫ్ డేట్ పేరుతో తదుపరి విద్యా ప్రక్రియలకు అనుమతించకపోయినప్పటికీ, ఒక ప్రత్యేక విద్యార్థికి అనుచితంగా మినహాయింపు ఇవ్వటం ఏమిటని అయన ప్రశ్నించారు. ఒక విద్యార్థికి ప్రత్యేకంగా అనుమతి ఇవ్వడంపై అనేక అనుమానాలు వ్యక్తమౌతున్నాయని, ఓయూ వైస్ ఛాన్సలర్ తక్షణమే జోక్యం చేసుకొని అక్రమాలపై ఉన్నత స్థాయి కమిటీ వేసి విచారణ జరిపి ఆరోపణలు నిజమైతే అక్రమాలకు పాల్పడ్డ ప్రొఫెసర్లను సస్పెండ్ చేయాలనీ పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేసారు. లెనిన్ మాట్లాడుతూ ఓయూ రసాయన శాస్త్ర విభాగంలో జరిగిన అక్రమాలు దేశంలో ప్రతిష్టాత్మక విద్యాసంస్థగా పేరుగాంచిన ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతిష్టను దెబ్బతిస్తున్నాయన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికారాన్ని దుర్వినియోగం సిగ్గుచేటన్నారు. ఓయూ రసాయన శాస్త్ర విభాగంపై వచ్చిన ఆరోపణలపై నిష్పాక్షికమైన, సమగ్రమైన విచారణను నిర్వహించి వాస్తవాలను వెలికితీసి, ఆరోపణలు నిజమని తేలిన పక్షంలో, సంబంధిత ప్రొఫెసర్లపై కఠిన చెర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ పోరాటాలు తీవ్రతరం చేస్తుందని ఐ. లెనిన్ హెచ్చరించారు.

# ప్రజల ఓటు హక్కుల పరిరక్షణే లక్ష్యం- పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలి

» ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి
ప్ర» పత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలి
» "ఓటర్లకు కీలక సూచన.. ఎన్యూమరేషన్ ఫారం తప్పనిసరి"
» టిఆర్ఎస్ వరంగల్, హనుమకొండ జిల్లాల ఇంచార్జ్ లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు



కరపత్రం ప్రతినిది బ్యూరో, జూన్ 25

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ప్రతి అర్హుడైన పౌరుడు తన ఓటు హక్కును పరిరక్షించుకోవడంతో పాటు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, బి ఎల్ వో లు చురుకుగా పాల్గొని, ప్రజల ఓటు హక్కుల రక్షణే ధ్యేయంగా –ఒక సైనికుడిగా పనిచేయాలని టీఆర్ఎస్ వరంగల్, హనుమకొండ జిల్లాల ఇన్‌చార్జ్ లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు పిలుపు నిచ్చారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును కాపాడుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ.. జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించనున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఓటర్లకు అత్యంత కీలకమైనదని తెలిపారు. ఓటరు జాబితాలో ఇప్పటికే పేర్లు ఉన్నవారు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారంను పూర్తి చేసి సంబంధిత బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని సూచించారు. ఫారం సమర్పించని పక్షంలో ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేకపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఓటరు జాబితా పరిశుభ్రత, పారదర్శకత, ఖచ్చితత్వం కోసం ఎన్నికల సంఘం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఫారాలను అందజేస్తారని, ప్రజలు వారికి పూర్తి సహకారం అందించాలని కోరారు. అవసరమైన వివరాలు, గుర్తింపు పత్రాలు, కుటుంబ సభ్యుల సమాచారం తదితరాలను సమగ్రంగా అందించాలని సూచించారు.
ప్రత్యేకించి 18 సంవత్సరాలు పూర్తి చేసుకుని 19వ సంవత్సరంలోకి ప్రవేశించిన యువత తమ పేర్లను తప్పనిసరిగా ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికల్లో యువత పాత్ర అత్యంత కీలకమని, ప్రతి యువ ఓటరు తన హక్కును వినియోగించుకునేలా ముందుకు రావాలని అన్నారు. ఓటు హక్కు కేవలం వ్యక్తిగత హక్కు మాత్రమే కాదని, అది ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసే బాధ్యత కూడా అని నడిపెల్లి వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే నిర్ణీత గడువులోపు సమర్పించాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 31 లక్షల 59 వేల 307 మంది ఓటర్లు ఉన్నారని, ఇప్పటికే 82.02 శాతం మ్యాపింగ్ పూర్తయిన నేపథ్యంలో మిగిలిన ప్రక్రియను కూడా విజయవంతంగా పూర్తి చేయడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలని, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను పాటించి ఓటు హక్కును కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామాలు, వార్డులు, బూత్ స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని సూచించారు. ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా చూడడం ప్రతి కార్యకర్త బాధ్యతగా భావించాలని అన్నారు. ప్రజల ఓటు హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన విధివిధానాల ప్రకారం ప్రజలకు సహకారం అందించాలని సూచించారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటరు జాబితా సవరణ ప్రక్రియ విజయవంతం కావడం ఎంతో అవసరమని, ఈ కార్యక్రమంలో ప్రజలు, అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన కోరారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల కానున్న నేపథ్యంలో ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా తమ వివరాలను సకాలంలో సమర్పించాలని లయన్ డాక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# కాలం చెల్లిన బూజు పట్టిన పచ్చళ్ల గుట్టురట్టు

- రూ.3.40 లక్షల విలువైన నిల్వలు స్వాధీనం.. వ్యాపారి అరెస్ట్
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడిన వ్యాపారిపై కేసు నమోదు

కరపత్రం ప్రతినిది వరంగల్, జూన్ 25



ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి కాలం చెల్లిన, బూజు పట్టిన పచ్చళ్లను విక్రయిస్తూ అక్రమ వ్యాపారం సాగిస్తున్న ఓ వ్యాపారిని ఇంతేజార్‌గంజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి నిర్వహించిన సంయుక్త దాడుల్లో భారీ మొత్తంలో నిల్వ ఉంచిన నాసిరకం పచ్చళ్లను స్వాధీనం చేసుకున్నారు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, విశ్వసనీయ సమాచారం మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.ఏ. షకూర్ ఆదేశాలపై పోలీసులు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బృందం కాశీబుగ్గ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీబుగ్గకు చెందిన పచ్చళ్ల వ్యాపారి ఆరికాల శ్రీనివాస్ (51) అక్రమంగా పచ్చళ్ల తయారీ, విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించారు. విచారణలో నిందితుడు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు, లైసెన్సులు పొందకుండా పచ్చళ్లను తయారు చేస్తున్నట్లు తేలింది. అంతేకాకుండా కాలం చెల్లి బూజు పట్టిన పచ్చళ్లకు ప్రిజర్వేటివ్స్ కలిపి మళ్లీ విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రజలను మోసగిస్తూ ఆరోగ్యానికి హానికరమైన ఆహార పదార్థాలను మార్కెట్‌లోకి పంపుతున్నట్లు వెల్లడైంది.
దాడుల్లో మొత్తం 17 డ్రమ్ములలో నిల్వ ఉంచిన కాలం చెల్లిన పచ్చళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 9 డ్రమ్ముల మామిడికాయ పచ్చడి, 5 డ్రమ్ముల టమాటా పచ్చడి, 2 డ్రమ్ముల నిమ్మకాయ పచ్చడి, 1 డ్రమ్ము ఉసిరికాయ పచ్చడి ఉన్నాయి. స్వాధీనం చేసుకున్న పచ్చళ్ల విలువ సుమారు రూ.3.40 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 25**
పేద ప్రజల సంక్షేమం, మహిళల సాధికారత, గ్రామీణాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఇంటికి భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు.
రఘునాథపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన 47 మంది కల్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.47.05 లక్షలు, అలాగే 24 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.8.32 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహం తల్లిదండ్రులకు ఆర్థిక భారం అవుతుందని, అలాంటి సమయంలో కల్యాణ లక్ష్మి పథకం ద్వారా అందిస్తున్న రూ.1,00,116 ఆర్థిక సాయం కుటుంబాలకు గొప్ప అండగా నిలుస్తోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులు, మహిళలు, పేదల



సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని అనేక ప్రజాహిత కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.
మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంపై అప్పుల భారం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు ఉండకూడదని స్పష్టం చేసిన కడియం శ్రీహరి, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్, ఇందిరమ్మ ఇళ్లు సహా ఏ ప్రభుత్వ పథకం కోసం కూడా ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని హెచ్చరించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం నేరుగా అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు నిజాయితీగా వ్యవహరించాలని,



అవినీతి సహించబోమని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి భారీ నిధులు తీసుకువస్తున్నామని పేర్కొన్న ఆయన, ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రూ.60.62 కోట్ల వ్యయంతో ఏడు విద్యుత్ సబ్‌స్టేషన్లకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారని గుర్తు చేశారు. రఘునాథపల్లి సబ్‌స్టేషన్‌ను 220 కేవీ సబ్‌స్టేషన్‌గా అప్‌గ్రేడ్ చేయాలని చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, దాదాపు రూ.100 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న ఈ సబ్‌స్టేషన్‌తో నియోజకవర్గంలో లో వోల్టేజ్ సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, తహసీల్దార్, ఎంపీడీవో, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

- ఇంటింటి సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కరపత్రం ప్రతినిధి వరంగల్, జూన్ 25**
ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు ఓటర్ల సందేహాలను నివృత్తి చేయడానికి వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్ప్ డెస్క్ పనితీరును పరిశీలించిన కలెక్టర్,ఓటరు నమోదు,మార్పులు,చేర్పులు,తొలగింపులకు సంబంధించిన సేవలను ప్రజలకు వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని అధికారులకు సూచించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ గణేష్,వరంగల్ తాసిల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

» ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరసింహ నాయక్

**కరపత్రం ప్రతినిధి హైదరాబాద్, జూన్ 24**
రిజర్వేషన్ పేరు మీద గిరిజన ఓట్లను దండుకోవడం కోసం బస్సు యాత్ర పెట్టడం సిగ్గుచేటు అని ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నరసింహ నాయక్ అన్నారు. బస్సు యాత్ర సందర్భంగా గురువారం ఉదయం నరసింహ నాయక్ ను ఆయన ఇంటి దగ్గర పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. లంబాడీలకు రిజర్వేషన్ కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చినట్టుగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా రావలసినటువంటి రిజర్వేషన్ ను కల్పించడం జరిగింది కానీ, కాంగ్రెస్ పార్టీ ఏదో లంబాడి జాతిని ఉద్ధరించినట్టుగా కాంగ్రెస్ నేతలు మాట్లాడటం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్సీ రాముల నాయక్, ప్రస్తుత ఎమ్మెల్సీగా ఉన్న శంకర్ నాయక్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రు నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్, ఎంపీ బలరాం నాయక్ వారి నియోజకవర్గం, లంబాడీల అభివృద్ధి కోసం ఏమీ అభివృద్ధి చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలి, సేవాలాల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి, ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని అన్నారు.



# గంజాయి రహిత సమాజ నిర్మాణానికి యువత ముందుకు రావాలి

- మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అవగాహన
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఏ. ప్రదీప్

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 25**
యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటేనే ఆరోగ్యకరమైన, అభివృద్ధి చెందిన సమాజం సాధ్యమవుతుందని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఏ. ప్రదీప్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, మామునూరులో నిర్వహించిన మాదకద్రవ్యాల నిర్మూలన – అవగాహన సదస్సు లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఏ. ప్రదీప్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును అంధకారంలోకి





నెట్టివేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. సరదాగా ప్రారంభమయ్యే మత్తు పదార్థాల వినియోగం క్రమంగా వ్యసనంగా మారి జీవితాలను నాశనం చేస్తుందని హెచ్చరించారు. మాదకద్రవ్యాల ప్రభావంతో సామాజిక, మానసిక, శారీరక సమస్యలు తలెత్తడంతో పాటు నేరాలకు పాల్పడే ప్రమాదం కూడా పెరుగుతుందని తెలిపారు. గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు న్యాయ సేవాధికార సంస్థలు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతలో చైతన్యం కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వ్యక్తులు కుటుంబాలకు, సమాజానికి భారంగా మారే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. అందుకే ప్రతి విద్యార్థి తన లక్ష్యాలపై దృష్టి సారించి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.
మత్తు పదార్థాల వినియోగం చట్టరీత్యా నేరమని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండి తమ పరిసరాల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నా లేదా విక్రయిస్తున్నా వెంటనే పోలీసులకు లేదా 1933 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని కోరారు.
అనంతరం విద్యార్థులతో కలిసి “డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించి భావితరాలకు సురక్షితమైన భవిష్యత్తు అందిద్దాం” అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని సంకల్పం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి. శ్రీనివాసరావు, సైకాలజిస్ట్ రాధా శివపురం, పోలీసు అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్ వై. మనోహర్ రెడ్డితో పాటు సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆజం జాహీ మిల్ కార్మికులకు స్థలాలు కేటాయించాలి ఐఎఫ్‌టీయూ

**కరపత్రం ప్రతినిధి వరంగల్, జూన్ 25**





వరంగల్ జిల్లా ఆజం జాహీ మిల్ కార్మికులకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు స్థలాలు కేటాయించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంగుల దయాకర్ డిమాండ్ చేశారు.లేనిపక్షంలో కుడా (కుడా) నిర్వహించే భూముల వేలంపాటలను అడ్డుకుంటామని హెచ్చరించారు. వరంగల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో గంగుల దయాకర్‌తో పాటు టీపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం కుమారస్వామి, ప్రజా సంఘాల నాయకులు యశోదరాజు,కార్మికులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగుల దయాకర్,జనగాం కుమారస్వామి మాట్లాడుతూ.. ఆజం జాహీ మిల్ మూతపడటంతో వందలాది కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయని పేర్కొన్నారు.కార్మికుల పునరావాసం కోసం ప్రభుత్వం గతంలో స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని,ఆ హామీని వెంటనే అమలు చేయాలని కోరారు.ఆజం జాహీ మిల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని వారు అన్నారు.కార్మికులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు స్థలాల కేటాయింపుపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో కుడా చేపట్టే భూముల వేలంపాటలను ప్రజా సంఘాలు,కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పలువురు కార్మికులు తమ సమస్యలను వివరించి,ప్రభుత్వం హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# తుంగభద్రలో తెలంగాణ నీటి హక్కులకు గండికొట్టే పనికి సీఎం మద్దతు ఇవ్వొద్దు

- ఆర్డీఎస్ పరిధిలో కర్ణాటక చేపడుతున్న ప్రాజెక్టులు తెలంగాణకు తీవ్ర అన్యాయం
- సెంట్రల్ వాటర్ కమిషన్ వద్ద అఖిలపక్ష పోరాటానికి ప్రభుత్వం ముందుకు రావాలి
- టిఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

**కరపత్రం ప్రతినిధిబ్యూరో, జూన్ 25**
తుంగభద్ర నదిలో తెలంగాణకు ఉన్న నీటి హక్కులను ప్రమాదంలోకి నెట్టే విధంగా కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతు ఇవ్వకూడదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆర్డీఎస్ (రాజోలిబండ డైవర్షన్ స్కీమ్) పరిధిలో కర్ణాటక నిర్మిస్తున్న రిజర్వాయర్లు, బ్యారేజీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకావడం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమని ఆమె పేర్కొన్నారు.
తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు గడిచినా కృష్ణా, తుంగభద్ర జలాల్లో రాష్ట్రానికి కేటాయించిన వాటాను పూర్తిస్థాయిలో వినియోగించు కోలేకపోయిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీఎస్‌లో తెలంగాణకు 16 టీఎంసీల నీటి వాటా ఉన్నప్పటికీ ఇప్పటివరకు 6 టీఎంసీలకు మించి వినియోగించుకోలేదని తెలిపారు. నడిగడ్డ ప్రాంత అభివృద్ధికి కీలకమైన ఆర్డీఎస్‌ను బలోపేతం



చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు.
ఇదే సమయంలో కర్ణాటక ప్రభుత్వం ఆర్డీఎస్‌కు ఎగువన, దిగువన పలు ప్రాజెక్టులను నిర్మిస్తూ దాదాపు 10 టీఎంసీల నీటిని వినియోగించుకునే ప్రణాళిక అమలు చేస్తోందని ఆరోపించారు. కురిడి, కల్పగల్ గ్రామాల వద్ద రెండు టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్లు, చిక్కాలపర్వి వద్ద 2.50 టీఎంసీల సామర్థ్యంతో బ్యారేజ్, రాయచూరు జిల్లాలో మరో ఐదు టీఎంసీల సామర్థ్యంతో బ్యారేజ్ నిర్మాణం చేపడుతున్నారని వివరించారు. కర్ణాటకకు ఆర్డీఎస్‌లో కేవలం 1.20 టీఎంసీల వాటా మాత్రమే ఉన్నప్పటికీ, భారీ స్థాయిలో నీటిని వినియోగించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. ఈ



ప్రాజెక్టులు పూర్తయితే తుంగభద్రలో తెలంగాణ హక్కులు శాశ్వతంగా దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కర్ణాటక కార్యక్రమానికి వెళ్లడం కంటే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని సెంట్రల్ వాటర్ కమిషన్‌ను కలిసి తెలంగాణ హక్కుల కోసం పోరాటం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా కృష్ణా, తుంగభద్ర జలాల్లో తెలంగాణ వాటాను కాపాడాలని కోరారు.
ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం జిల్లాల భవిష్యత్తు నీటి లభ్యతపై ఆధారపడి ఉందని పేర్కొన్న కవిత, తెలంగాణకు శాశ్వత సాగు, తాగునీటి భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా ఏఐఎస్బీ 76వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కరపత్రం ప్రతినిధి వరంగల్, జూన్ 25**
అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్బీ) 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఐఎస్బీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వేణురావు కాలనీలో గురువారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కన్వీనర్ రోహిత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏఐఎస్బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హకీమ్ నవీద్ మాట్లాడుతూ.. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి అనుబంధంగా 1951 జూన్ 25న పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ (ఏఐఎస్బీ) ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి నేటి వరకు నేతాజీ ఆశయాల సాధన కోసం,కుల,మత,ప్రాంత భేదాలకు అతీతంగా సోషలిజం లక్ష్యంగా విద్యార్థి,యువజనుల్లో జాతీయ భావాలను పెంపొందించేందుకు,నేతాజీ కలలు కన్న భారతదేశ పునర్నిర్మాణం కోసం దేశ వ్యాప్తంగా ఏఐఎస్బీ ఉద్యమిస్తోందని తెలిపారు. విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యతను విస్మరించి,విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని విమర్శించారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని,ప్రభుత్వ పాఠశాలల మూసివేత ఆలోచనలను ప్రభుత్వం తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్బీ నాయకులు రోహిత్, సతీష్,హరీష్,శ్రీవాస్ తదితరులు పాల్గొన్నారు.



# పేదల ఇళ్ల స్థలాల కోసం వామపక్షాల పోరాటం ఉధృతం

- జూన్ 27న భారీ నిరసన ప్రదర్శన – జూలై 1న కలెక్టరేట్ల ముట్టడి
- పేదలకు పట్టాలు ఇవ్వాలి..
- గుడిసెల కూల్చివేతలు వెంటనే ఆపాలి
- సీపీఐ, సీపీఎం

**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 25**
పేదల ఇళ్ల స్థలాల సాధన కోసం దశలవారీ ఉద్యమ కార్యాచరణను చేపట్టనున్నట్లు సీపీఐ, సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శులు కర్రె బిక్షపతి, గాదె ప్రభాకర్ రెడ్డి ప్రకటించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న పేదల గుడిసెల కూల్చివేతలను నిరసిస్తూ ఈ నెల 27న భారీ నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. హనుమకొండ ఏకశిలా పార్క్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు సుమారు పదివేల మందితో ర్యాలీ చేపట్టనున్నామని, ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీతో పాటు పలువురు వామపక్ష నేతలు పాల్గొంటారని వెల్లడించారు. జూలై 1న హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్ల ఎదుట





పికెటింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తామని, జూలై 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా చేపట్టి రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి పేదల సమస్యలను తీసుకెళ్తామని తెలిపారు.
ప్రభుత్వం పేదల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ, భూకబ్జాదారులు మరియు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గోపాల్‌పూర్ చెరువు సుందరీకరణ పేరిట 200 మంది పేదల గుడిసెలను, గుండ్ల సింగారంలో 360 మంది పేదల నివాసాలను కూల్చివేయడం అమానుషమని పేర్కొన్నారు. గుడిసెల కూల్చివేతలకు ముందు పూర్తి స్థాయి సర్వే నిర్వహించి అర్హులైన పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని, ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా బుల్డోజర్లతో ఇళ్లను ధ్వంసం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. వరంగల్ నగర విస్తరణతో గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం వచ్చిన పేదలు కిరాయిలు భరించలేక ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, వారి జీవన హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గత ప్రభుత్వ కాలం నుంచి నివసిస్తున్న పేదలను లక్ష్యంగా చేసుకుని ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. వరంగల్ మహానగరంలో ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడుతూ, వేలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు సాధించిపెట్టిన ఘనత వామపక్ష పార్టీలకేనని పేర్కొన్నారు. పేదల హక్కుల కోసం అవసరమైతే మరో “బషీర్‌బాగ్” తరహా ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఎన్. అశోక్ స్టాలిన్, మునిగాల బిక్షపతి, జక్కు రాజుగౌడ్, సీపీఎం నాయకులు ఎం. చుక్కయ్య, రాగుల రమేశ్, బొట్ల చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.